
MRR 69 TV

అవినీతిపై అక్షర సమరం

# మన అంకుశం

సంచలన సాయంకాలం దినపత్రిక




ఎడిటర్ : మచ్చా రామలింగారెడ్డి | సంపుటి : 6 | సంచిక : 39 | సోమవారం 16 ఫిబ్రవరి 2026 | పేజీలు : 4 | వెల : 3/-



### అంబటి రాంబాబు కస్టడీ, బెయిల్ పిటిషన్లపై

# తీర్పు రిజర్వ్

- సంక్రాంతి సంబరాల పేరుతో లక్కీ డ్రా నిర్వహించిన కేసు
- అంబటికి బెయిల్ మంజూరు చేయాలని కోర్టును కోరిన న్యాయవాది పొన్నవోలు
- పూర్తి స్థాయి విచారణ కోసం కస్టడీ అవసరమన్న పోలీసుల తరపు న్యాయవాది

**అంకుశం ప్రత్యేక ప్రతినిధి అమరావతి**

మాజీ మంత్రి, వైసీపీ నేత అంబటి రాంబాబు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌తో పాటు పోలీస్ కస్టడీ కోరుతూ దాఖలైన పిటిషన్లపై గుంటూరు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో విచారణ జరిగింది. ఇరుపక్షాల వాదనలు విన్న కోర్టు తీర్పును 18వ తేదీకి రిజర్వ్ చేసింది. ఈ కేసు 2023 సంక్రాంతి సంబరాల పేరుతో నిర్వహించిన లక్కీ డ్రా వ్యవహారానికి సంబంధించినది. అంబటి రాంబాబు తరఫున పొన్నవోలు సుధాకరరెడ్డి వాదనలు వినిపించారు. తీవ్ర నేరాలు, జీవితఖైదు శిక్షలు పడే కేసుల్లోనే బెయిల్ నిరాకరించాలని ఈ సందర్భంగా పొన్నవోలు అన్నారు. ఏడేళ్లలోపు శిక్ష పడే కేసుల్లో రిమాండ్ అవసరం లేదని చెప్పారు. ఈ కేసులో రెండేళ్లలోపు శిక్ష విధించే సెక్షన్లు మాత్రమే ఉన్నాయి కాబట్టి కస్టడీ అవసరం లేదని... బెయిల్ - మిగతా3లో

# ఏపీలో టెక్నాలజీ పాలన భేష్

- ఆర్టీజీఎస్ సందర్శన అనంతరం బిల్ గేట్స్ వెల్లడి
- డేటాలేక్, సంజీవని, అమరావతి ప్రాజెక్టుల గురించి గేట్స్‌కు వివరించిన సీఎం చంద్రబాబు
- డేటాలేక్, అవేర్ 2.0, వాట్సప్ గవర్నెన్స్, సంజీవని డిజిటల్ హెల్త్ రికార్డులు, అమరావతి రాజధాని అంశాలపై అధికారులు బిల్ గేట్స్‌కు డిస్ ప్లే వాల్స్ ద్వారా ప్రజెంటేషన్
- రాష్ట్రంలో జీఎస్డీపీ పెరుగుదలను కూడా కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్ల ద్వారా ఎప్పటికప్పుడు అంచనా వేస్తున్నాం



**అంకుశం ప్రత్యేక ప్రతినిధి అమరావతి**


**అమరావతి**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో టెక్నాలజీతో అందిస్తున్న పాలన అద్భుతంగా ఉందని గేట్స్ ఫౌండేషన్ చైర్మన్ బిల్ గేట్స్ వ్యాఖ్యానించారు. సోమవారం అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఉన్న రియల్ టైమ్ గవర్నెన్స్ కేంద్రాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి సందర్శించిన బిల్ గేట్స్ అక్కడ డిస్ ప్లే వాల్స్‌పై ప్రదర్శించిన ప్రజంటేషన్లను తిలకించారు. ఆర్టీజీఎస్ నుంచి పాలనలో టెక్నాలజీ వినియోగాన్ని ఆసాంతం పరిశీలించారు. రియల్ టైమ్ గవర్నెన్స్ ద్వారా పౌర సేవల్ని వేగంగా అందిస్తున్న తీరు, ఫలితాలను గేట్స్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు వివరించారు. ముందుగా రాష్ట్రంలోని డేటా లేక్ వ్యవస్థ ద్వారా అన్ని ప్రభు త్వ విభాగాలనూ అనుసంధానించామని తద్వారా వేగంగా నిర్ణయాలు తీసుకోగలుగుతున్నామని తెలిపారు. డేటాలేక్, అవేర్ 2.0, వాట్సప్ గవర్నెన్స్, సంజీవని డిజిటల్ హెల్త్ రికార్డులు, అమరావతి రాజధాని అంశాలపై అధికారులు బిల్ గేట్స్‌కు డిస్ ప్లే వాల్స్ ద్వారా ప్రజెంటేషన్ ఇచ్చారు. అవేర్ 2.0 ద్వారా రియల్ టైమ్‌లో సమాచారాన్ని సేకరించి దానిని ప్రజలకు వేగంగా అందిస్తున్నట్టు తెలియచేశారు. 42 రకాల సమాచారాన్ని ప్రజలకు, రైతులకు అందించటం ద్వారా తక్షణం స్పందించేందుకు ఆస్కారం కలుగుతోందని ముఖ్యమంత్రి తెలిపారు. అలాగే వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా పౌరసేవల్ని కూడా సులభతరం చేశామని...ప్రజల చేతుల్లోకి 921 సేవలను తీసుకెళ్లామని సీఎం వివరించారు.

### డిజిటల్ విప్లవంలో చంద్రబాబుది

# కీలక పాత్ర

- బిల్ గేట్స్ కితాబు
- బిల్‌గేట్స్‌తో మంత్రుల ప్రత్యేక సమావేశం
- గేట్స్ ఫౌండేషన్ తో ఏపీకి కొత్త దశ-దిశ
- ప్రజా సాధికారత, సంపద సృష్టి లక్ష్యం
- బిల్ గేట్స్‌తో సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు



**అమరావతి**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, గేట్స్ ఫౌండేషన్ మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యంతో రాష్ట్ర అభివృద్ధికి కొత్త దశ-దిశ ఏర్పడుతుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. గేట్స్ ఫౌండేషన్ చైర్మన్ బిల్ గేట్స్ అమరావతి రాక చారిత్రాత్మకంగా నిలుస్తుందని, ఆంధ్రప్రదేశ్ ప్రజల సాధికారతకు ఇది దోహదపడుతుందని ముఖ్యమంత్రి అన్నారు. సోమవారం బిల్ గేట్స్ అమరావతి పర్యటనలో భాగంగా సచివాలయంలో మంత్రులు, ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించిన ముఖ్యమంత్రి... ముందుగా గేట్స్, ఆయన బృందానికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బిల్ గేట్స్‌తో తన అనుబంధాన్ని ముఖ్యమంత్రి గుర్తు చేసుకున్నారు. 1997లో మొదటిసారి తాను బిల్ గేట్స్‌ను కలిశానని... హైదరాబాద్‌లో మైక్రోసాఫ్ట్ ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకతను వివరించానని... మైక్రోసాఫ్ట్ రాకతో ఇప్పుడు - మిగతా3లో



## ప్రపంచం భారత్‌కు వస్తోంది

- ఇండియా ఏఐ సమ్మిట్‌పై ప్రధాని మోదీ
- ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్‌కు ప్రపంచ దేశాలకు ఆహ్వానం పలికిన ప్రధాని మోదీ
- ఇండియా ఏఐ ఇంపాక్ట్ ఎక్స్‌పోను ప్రారంభించనున్న ప్రధాని
- 'పలు రంగాల్లో విప్లవాత్మకమైన మార్పులు'

### భారత డిజిటల్ విప్లవంలో

# మోదీ, చంద్రబాబు కీలకపాత్రధారులు

- చంద్రబాబుతో ఉంటే బిల్ గేట్స్‌ను కలుస్తారు...
- జగన్‌ను నమ్ముకుంటే గేటు బయటే ఉంటారు
- చంద్రబాబు, జగన్ తీరును పోలుస్తూ రెండు ఫొటోలతో పార్థసారథి సోషల్ మీడియాలో పోస్ట్
- అమరావతిలో చంద్రబాబుతో భేటీ అయిన మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్
- డిజిటల్ పాలనలో చంద్రబాబు కృషి అమోఘమని బిల్ గేట్స్ ప్రశంస

**అంకుశం ప్రత్యేక ప్రతినిధి అమరావతి**

మాజీ ముఖ్యమంత్రి జగన్ ను ఉద్దేశించి ఏపీ మంత్రి కొలుసు పార్థసారథి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. "చంద్రబాబు గారితో ఉంటే బిల్ గేట్స్‌ను కలుస్తారుడ జగన్‌ను నమ్ముకుంటే గేటు బయటే ఉంటారు" అంటూ సోషల్ మీడియా వేదికగా ఎద్దేవా చేశారు. ఈ మేరకు ఆయన రెండు ఫొటోలను పోలుస్తూ ఒక పోస్ట్ పెట్టారు. ఒక ఫొటోలో వైసీపీ అధినేత జగన్ తన ఇంటి నుంచి బయటకు వస్తుండగా, పలువురు వైసీపీ నేతలు గేటు బయట వేచి ఉన్న దృశ్యాన్ని మంత్రి పంచుకున్నారు. మరో ఫొటోలో - మిగతా3లో



## దేశవ్యాప్తంగా సీసీటీవీలు ఏర్పాటు



- రాష్ట్రాలను కలుపుతూ భారీ నెట్‌వర్క్
- మాదక ద్రవ్యాల రవాణాకు చెక్
- దేశమంతా సీసీ కెమెరాల అనుసంధానం
- ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూమ్స్ ఏర్పాటు
- సరిహద్దుల్లో అధునాతన టెక్నాలజీ
- ఢిల్లీ పోలీసుల 79వ ఆవిర్భావ దినోత్సవంలో కేంద్ర హోంమంత్రి కీలక వ్యాఖ్యలు

## మతపరమైన ప్రదేశాల్లో మహిళల వివక్ష కేసు

- 9మంది న్యాయమూర్తులతో సుప్రీంకోర్టు బెంచ్ ఏర్పాటు
- మహిళలకు ఆలయ ప్రవేశం అంశంపై సుప్రీం కోర్టు కీలక నిర్ణయం
- తొమ్మిది మంది న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనం ఏర్పాటు



## పార్లమెంట్ సజావుగా సాగడం రాహుల్‌కు ఇష్టం లేదు

- లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీపై విమర్శలు గుప్పించిన కేంద్రమంత్రి కిరణ్ రిజిజు
- పార్లమెంట్ సజావుగా సాగడం రాహుల్‌కు ఇష్టం లేదని ఆరోపణలు
- పార్లమెంట్‌లో చిన్న పార్టీలు మాట్లాడే సమయాన్ని కోల్పోతున్నందున సభను నిలిపివేయవద్దు



# సైలెంట్ మోడ్‌లోకి కొట్టు సత్యనారాయణ

**ఏలూరు :** పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో సీనియర్ నేత అలకపాన్పు వైసీపీలో చర్చనీయాంశంగా మారింది. తాడేపల్లిగూడెం నియోజకవర్గ ఇంచార్జ్ బాధ్యతల నుంచి తప్పించడంతో..మాజీ డిప్యూటీ సీఎం, కొట్టు సత్యనారాయణ పూర్తిగా సైలెంట్ మోడ్‌లోకి వెళ్లిపోయారు. పార్టీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ మెంబర్ పోస్ట్ ఇచ్చినప్పటికీ, ఇప్పటివరకూ ప్రజాపక్షంగా గానీ, పార్టీ పరంగా గానీ ఆయన గొంతు వినిపించకపోవడంతో, కొట్టు అలకపాన్పు ఎక్కినట్లు చర్చే జరగుతోంది.వడ్డీ రఘురామ్ నాయుడుకు వైసీపీ అధిష్టానం తాడేపల్లిగూడెం అసెంబ్లీ కోఆర్డినేటర్‌గా నియమించడంతో ఒక్కసారిగా సీన్ మారిపోయింది. అయితే కొట్టు మద్దతు ఇస్తారా, లేదా అన్న డైలమా కొనసాగింది. కానీ క్యాడర్ ఆయన మద్దతు ఉన్నా, లేకున్నా, ముందుకు వెళ్లడం తప్పదంటూ కొత్త రథసారథికి స్వాగతం పలకడం, నియోజకవర్గ స్థాయి విస్తృత సమావేశాన్ని సక్సెస్ చేయడంతో..కొట్టు డైలమాలో పడిపోయారట.ఈ సమావేశానికి ఇదే తాడేపల్లిగూడెంలో ఉండి కూడా కొట్టు సత్యనారాయణ హాజరుకాకపోవడం హాట్ టాపిక్‌గా మారింది. జిల్లా పార్టీ అధ్యక్షుడితో కలిపి వడ్డీ రఘురామ్ స్వయంగా కొట్టు సత్యనారాయణ నివాసానికి వెళ్లి మరీ, పార్టీ సమావేశానికి రావాలని ఆహ్వానించినా, ఆయన గైర్హాజరు కావడంపై అధిష్టానం దృష్టికి తీసుకెళ్లారట. తాడేపల్లిగూడెం, పెంటపాడు మండల అధ్యక్షులు కూడా సమావేశానికి రాకపోవడంతో, వారిపై వేటు తప్పదేమోనన్న చర్చ మొదలైంది.తాడేపల్లిగూడెంలో క్యాడర్‌ను బలోపేతం చేసే పనిలో పడ్డారట వడ్డీ రఘురామ్. పార్టీ ఇంచార్జ్ బాధ్యతలు నుంచి తొలగించిన తర్వాత ఎక్కడా కనపడని కొట్టు సత్యనారాయణ..భీమవరం పర్యటనకు వెళ్లిన వైసీపీ అధినేత



జగన్‌కు స్వాగతం పలికారు. ఆ సమయంలో కొట్టు సత్యనారాయణతో జగన్ కాస్త సీరియస్‌గానే వ్యవహరించినట్లు టాక్. అధిష్టానం నిర్ణయానికి ఎవరైనా కట్టుబడి ఉండాల్సిందేనని చెప్పినట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ పార్టీలో, ఆ తర్వాత టీడీపీలో, ఆ తర్వాత వైసీపీలో చేరి ఎమ్మెల్యేగా, మంత్రిగా, డిప్యూటీ సీఎంగా కూడా పనిచేసిన కొట్టు సత్యనారాయణ నెక్స్ట్ స్టెప్ ఏంటనేది ఆసక్తికరంగా మారింది. ఓవైపు నియోజకవర్గంలో జనసేన ఎమ్మెల్యే ఉండటంతో ఆ పార్టీలోకి వెళ్లే ఛాన్స్ లేదంటున్నారు. ఇక టీడీపీలోకి వెళ్ళాలనుకున్నా..కొట్టు సత్యనారాయణను అంత తేలికగా పార్టీలోకి చేర్చుకోరని, పసుపు కండువా కప్పే అవకాశమే ఉండదని ప్రచారం జరుగుతోంది. దీంతో కొట్టు రాజకీయ భవిష్యత్ ప్రశ్నార్ధకంగా మారిందన్న టాక్ వినిపిస్తోంది.తాడేపల్లిగూడెం వైసీపీలో రెండు వర్గాలు ఉండగా..కొట్టు సత్యనారాయణకు వైసీపీ అధిష్టానం చెక్ పెట్టడంతో..ఇక నియోజకవర్గంలో పార్టీ దూకుడుకు ఎలాంటి అడ్డంకులు ఉండబోవని క్యాడర్ హ్యాపీగా ఫీల్ అవుతోందట. గత ఎన్నికలకు ముందే కొట్టును తప్పించి ఉంటే.. తాడేపల్లిగూడెంలో గెలిచే వాళ్లమంటూ పార్టీ పెద్దలకు చెప్పారట పలువురు ఫ్యాన్ పార్టీ లీడర్లు. దీంతో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో మీ ప్రతాపం చూపించండంటూ, నాయకులకు హితవు పలుకుతున్నారట వైసీపీ ముఖ్యనేతలు. కొత్త రథసారథి వడ్డీ రఘురామ్ అయినా అందర్నీ కలుపుకుని ముందుకెళ్తారో లేదో అన్నది కూడా చర్చనీయాంశంగా మారింది. అలక మీదున్న కొట్టు సత్యనారాయణ యాక్టీవ్ అవుతారా? లేక తనదారి తన చూసుకుంటారా అనేది క్యాడర్‌ను వెంటాడుతున్న ప్రశ్న. కొట్టుకు మద్దతుగా వైసీపీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశానికి గైర్హాజరైన మండల అధ్యక్షులపైనా వేటు వేస్తారా? వాళ్లిద్దరు కూడా వడ్డీ రఘురామ్‌తో కలిసి వస్తారా అనేది చూడాలి. ఇప్పటికైతే కొట్టు పొలిటికల్ ఫ్యూచర్‌లో డైలామాలో పడిందన్న చర్చ అయితే జరుగుతోంది.

# ఎన్నికలకు రెడీ అవుతున్న ఈసీ

**విజయవాడ :** స్థానిక పోరు, మున్సిపల్ ఎన్నికలపై ఏపీలో ఇప్పటినుంచే రాజకీయ వేడి రాజుకుంటోంది. లోకల్ బాడీస్, మున్సిపాలిటీల గడువు దగ్గర పడుతుంది. దీంతో స్థానిక ఎన్నికలకు ఈసీ రెడీ అవుతోంది. ఏపీలో ప్రస్తుత సర్పంచుల పదవీకాలం ఏప్రిల్‌లో ముగుస్తుంది.మార్చిలో..కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో కార్పొరేటర్లు, కౌన్సిలర్ల పదవీకాలం ముగియనుంది. అందుకు తగ్గట్లుగానే స్టేట్ ఎలక్షన్ కమిషన్ అరేంజ్‌మెంట్స్‌ను స్పీడప్ చేసింది. మార్చిలో టెన్త్ ఎగ్జామ్స్ అయిపోయాక మొదట మున్సిపల్ ఎన్నికలకు..ఆ తర్వాత కొంత సమయం తీసుకుని సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు పెట్టాలని ప్లాన్ చేస్తున్నారట. దీంతో ఏపీ రాజకీయ వేడి రాజుకుంటోంది. గ్రామాల్లో ఎలక్షన్ హీట్ స్టార్ట్ అయింది.రాష్ట్ర ఎన్నికల సంఘం ఇప్పటికే స్థానిక సంస్థల ఎన్నికల కోసం కసరత్తు మొదలెట్టింది. గత ఏడాది నుంచే ఏర్పాట్లలో బిజీ అయిపోయింది. అయితే జనగణన అడ్డంకిగా ఒకటి ఉందని ఆ మధ్య ప్రచారం జరిగింది. దాంతో ఎన్నికలు ఈ ఏడాది ఉండవేమో అని అనుకున్నారు. అయితే 2027 ఫిబ్రవరి 9 నుంచి 28 దాకా జనగణన ఉంటుందని అధికారులు ప్రకటించారు.స్థానిక ఎన్నికలు ముందుకు వచ్చాయి. యథావిధిగా షెడ్యూల్ ప్రకారం ఎన్నికలు జరిపించాలని చూస్తున్నారట. మార్చి 9లోగా కార్పొరేషన్లు మున్సిపాలిటీలు, నగర పంచాయతీలకు చెందిన ఓటర్ల తుది జాబితాను ఫోటోలతో సహా రిలీజ్ చేయాలని ఎన్నికల సంఘం జిల్లాల అధికారులను ఆదేశించింది. ఆ తర్వాత ఓటర్ల జనాభా ఆధారంగా రిజర్వేషన్లు ఖరారు చేసి ఎన్నికల తేదీని ప్రకటిస్తారన్న టాక్ వినిపిస్తోంది.టీడీపీ 2014 నుంచి 2019 మధ్య అధికారంలో ఉన్నప్పుడు స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించలేదు. అనేక కారణాలతో జాప్యం జరిగింది. చివరికి ఎన్నికల ముందు ఎందుకు అనుకుని వాయిదా వేశారు. అయితే ఈ సారి అధికారంలో కూటమి మాత్రమే లేదు, జనసేన బీజేపీ కూడా ఉన్నారు. స్థానిక సంస్థలకు ఎన్నికలు జరిపించాలని వారంతా కోరుతున్నారు.ఎన్నికలు జరిగితే ద్వితీయ తృతీయ శ్రేణి నేతలకు స్థానికంగా పదవులు దక్కుతాయని అంటున్నారు. దాంతో చాలాకాలంగా ఈ ఎన్నికల కోసం అంతా వేచి



చూస్తున్నారు. ఈ క్రమంలో ఎన్నికలు పెట్టి తీరాలన్న భావన కూటమి పెద్దల్లో వ్యక్తం అవుతోందట. అయితే ముందుగా కార్పోరేషన్లు, మున్సిపాలిటీల ఎన్నికలు పెట్టి..ఆ తర్వాత స్థానిక ఎన్నికలకు వెళ్లే ఆలోచనలో సర్కార్ ఉందంటున్నారు. ఆ నిర్ణయం వెనక కూటమి పెద్దల వ్యూహం ఉందని కూడా చర్చ జరుగుతోంది.పట్టణాలలో మొదటి నుంచి వైసీపీకి కొంత బలం తక్కువగా ఉంటుంది. పైగా కూటమి పార్టీలకు అనుకూలంగా ఓటర్లు ఉంటారని అంటుంటారు. దాంతో పట్టణాల నుంచే పల్లెల వైపుగా స్థానిక ఎన్నికల యుద్ధాన్ని తీసుకెళ్లాలని కూటమి పెద్దలు ఆలోచన చేస్తున్నారట. కూటమి పటిష్టంగా ఉంది. పైగా విద్యావంతులు తటస్థులు ఇలా విభిన్న వర్గాలు పట్టణాల్లో తమకు అనుకూలంగా ఉంటారని భావిస్తున్నారట. అయితే స్థానిక ఎన్నికలు, మున్సిపల్ ఎన్నికలు పెడితే వైసీపీకి అసలైన రాజకీయ యుద్ధంగానే ఉంటుందని అంటున్నారు.కూటమి పార్టీలు ఉమ్మడిగా వస్తే వారిని తట్టుకుని నిలవాల్సిన అవసరం వైసీపీకి ఎంతైనా ఉంది. వైసీపీ ధీటైన వ్యూహాలను రచించి..బలమైన అభ్యర్థులను బరిలోకి నిలబెట్టకపోతే ఇబ్బంది తప్పదన్న చర్చ జరుగుతోందట. అయితే అధికారంలో ఏ పార్టీ ఉంటే..స్థానిక ఎన్నికల్లో ఆ పార్టీకే అనుకూలంగా ఫలితాలు వస్తుంటాయి. అయినా సరే తమ ఉనికి కోసం పోరాటం చేయాల్సిన బాధ్యత విపక్షంపైన ఉంటుంది. ఎంతో కొంత తమ సత్తా చాటి తమ బలం పెంచుకోవాల్సి ఉంటుంది. కూటమితో అమీతుమీ తేల్చుకునేందుకు వైసీపీ సై అంటుందో లేక ఎన్నికలను లైట్ తీసుకుంటుందో వేచి చూడాలి.

# పోటీ చేయాలంటున్న కేడర్...

**నెల్లూరు :** తెలంగాణ , ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ప్రధాన ప్రతిపక్షాల తీరు మాత్రం భిన్నంగా కనిపిస్తోంది. తెలంగాణలో అధికారాన్ని కోల్పోయినప్పటికీ, బీఆర్ఎస్ పార్టీ క్షేత్రస్థాయిలో గట్టి పోటీనిస్తోంది. పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల ఫలితాలే అందుకు నిదర్శనం. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పటికీ, అనేక మున్సిపాలిటీలు , వార్డుల్లో గులాబీ జెండా రెపరెపలాడింది. రాజకీయాల్లో అధికారం కోల్పోయిన వెంటనే చేతులెత్తేయకుండా, ఉనికిని చాటుకోవడంలో బీఆర్ఎస్ విజయవంతమైందని విశ్లేషకులు భావిస్తున్నారు.తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ఫలితాలు బీఆర్ఎస్ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపాయి. సుమారు 730కి పైగా వార్డులను కైవసం చేసుకోవడమే కాకుండా, 15 మున్సిపాలిటీల్లో స్పష్టమైన మెజారిటీ సాధించి, మరో 30 చోట్ల అతిపెద్ద పార్టీగా ఆవిర్భవించింది. కేటీఆర్ , హరీష్ రావు వంటి నేతలు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ క్యాడర్‌ను ఉత్తేజపరచడం పార్టీకి ప్లస్ పాయింట్ అయింది. అధికార పక్షం ప్రలోభాలను ఒత్తిళ్లను తట్టుకుని బీఆర్ఎస్ నిలబడటం చూస్తుంటే, ఆ పార్టీ ఇంకా తన పట్టును పూర్తిగా కోల్పోలేదని అర్థమవుతోంది.మరోవైపు ఆంధ్రప్రదేశ్‌లో పరిస్థితి ఇందుకు భిన్నంగా కనిపిస్తోంది. వచ్చే నెలలో సర్పంచ్ , మున్సిపల్ ఎన్నికలు జరగనున్నాయన్న ప్రచారం ఉన్నప్పటికీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఆ స్థాయి సన్నాహాలు కనిపించడం లేదు. గత అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత అనేక మంది కీలక నేతలు పార్టీని వీడటం , మౌనంగా ఉండిపోవడం జగన్



మోహన్ రెడ్డికి అతిపెద్ద సవాల్‌గా మారింది. ప్రభుత్వం అక్రమ కేసులు బనాయిస్తోందని, ఓట్ల తొలగింపు జరుగుతోందని ఆరోపిస్తున్న వైసీపీ నేతలు.. ఎన్నికలను బహిష్కరించాలనే ఆలోచనలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే కొన్ని ఎన్నికలను బహిష్కరించిన వైసీపీ, ఇప్పుడు స్థానిక పోరుకు కూడా దూరంగా ఉంటే అది ఆత్మహత్య సదృశమే అవుతుందని పరిశీలకులు హెచ్చరిస్తున్నారు. ఈ విషయంలో వైసీపీ కూడా బీఆర్ఎస్ నుండి స్ఫూర్తి పొందాల్సిన అవసరం ఉంది. ఎన్నికల నుంచి తప్పుకోవడం వల్ల ప్రత్యర్థులకు ఏకగ్రీవ విజయాలను కట్టబెట్టినట్లవుతుంది. మిగిలి ఉన్న కేడర్ కూడా ఇతర పార్టీల వైపు చూసే అవకాశం ఉంది. ఏపీలో వైసీపీ నేతల మధ్య సమన్వయ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. మాజీ మంత్రులు , ఎమ్మెల్యేలు స్థానిక ఎన్నికల బాధ్యతను తీసుకోవడానికి వెనుకంజ వేస్తున్నారు. ప్రభుత్వం నుంచి ఎదురయ్యే ఇబ్బందులను ఎదుర్కోలేమనే భయం కొందరిలో ఉంటే, భవిష్యత్తుపై నమ్మకం లేక మరికొందరు మౌనంగా ఉన్నారు. ఇదే సమయంలో తెలంగాణలో బీఆర్ఎస్ నాయకత్వం తమ అభ్యర్థులకు అండగా నిలబడి, చట్టపరమైన , రాజకీయ పోరాటాలు చేస్తోంది. ఈ విధమైన ధైర్యం వైసీపీ అధినాయకత్వం ప్రదర్శించకపోతే, స్థానిక సంస్థల ఎన్నికల నాటికి పార్టీ మరింత బలహీనపడే ప్రమాదం ఉంది.ప్రజాస్వామ్యంలో స్థానిక సంస్థల ఎన్నికలు పార్టీకి పునాదుల వంటివి. అక్కడ బలపడితేనే వచ్చే సార్వత్రిక ఎన్నికలకు దారులు సుగమం అవుతాయి. బీఆర్ఎస్ పార్టీ ఈ సత్యాన్ని గ్రహించి పోరాడుతోంది. వైసీపీ కూడా బహిష్కరణలు, ఆరోపణలకే పరిమితం కాకుండా, తమకున్న 40 శాతం ఓటు బ్యాంకును కాపాడుకోవాలంటే ఎన్నికల బరిలో నిలవక తప్పదన్న అంచనా

## ఏపీలో టెక్నాలజీ పాలన భేష్

-మొదటిపేజీ తరువాయి

పౌరసేవలను సులభతరం చేయటం బాగుందని కితాబిచ్చారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, పాలసీల అమలుపై ప్రజాభిప్రాయాన్ని కూడా సేకరిస్తున్న తీరును తెలుసుకున్నారు. రాష్ట్రంలో జీఎస్డీపీ పెరుగుదలను కూడా కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్ల ద్వారా ఎప్పటికప్పుడు అంచనా వేస్తున్నామని బిల్ గేట్స్‌కు ముఖ్యమంత్రి వివరించారు. జీఎస్టీ అమల్లోకి వచ్చిన తర్వాత దేశంలో పన్నుల వసూళ్ల ప్రక్రియ బాగా సులభతరమైందని, వసూళ్లు కూడా పెరిగాయని ముఖ్యమంత్రి వివరించారు. గేట్స్ ఫౌండేషన్ సహకారంతో కుప్పం, చిత్తూరు జిల్లాలో నడుస్తున్న సంజీవని ప్రాజెక్టు అమలును గేట్స్ అత్యంత ఆసక్తిగా పరిశీలించారు. బ్లడ్ ప్రెషర్, డయాబెటీస్ లాంటి వైద్య పరీక్షల అనంతరం ఏం చర్యలు చేపడుతున్నారని అడిగి తెలుసుకున్నారు. ఎవరైనా ఆరోగ్యపరమైన సమస్యలు ఎదుర్కొంటే వారికి ఎలాంటి సేవలు అందుతున్నాయని గేట్స్ ఆరా తీశారు. కుప్పంలో అమలు చేస్తున్న సంజీవని డిజిటల్ హెల్త్ రికార్డుల ప్రాజెక్టు చక్కగా ఉందని కితాబు ఇస్తూ... దట్స్ వెరీ నైస్ అంటూ గేట్స్ వ్యాఖ్యానించారు. ప్రజల డిజిటల్ హెల్త్ రికార్డులను అనుసరించి వారి లైఫ్ స్టైల్ మార్పు, ఆహారం తీసుకునే అంశాల్లో సలహాలు ఇస్తున్నామని ముఖ్యమంత్రి వివరించారు. అనంతరం ప్రజా రాజధాని అమరావతి నిర్మాణాలపై ఇచ్చిన ప్రజంటేషన్‌ను కూడా బిల్ గేట్స్ ఆసక్తిగా పరిశీలించారు. రాజధాని నిర్మాణంలో 30 శాతం మేర నీటి వనరులు, పచ్చదనం కోసం కేటాయించిన ప్రణాళిక బాగుందని అన్నారు. రాజధాని నిర్మాణం జరుగుతున్న తీరును గేట్స్‌కు సీఎం చంద్రబాబు వివరించారు. దీనిపై స్పందించిన బిల్ గేట్స్ గ్రేట్ వర్క్ అంటూ వ్యాఖ్యానించారు. అంతకుముందు ఆర్టీజీఎస్ కేంద్రంలోకి వచ్చిన బిల్ గేట్స్‌కు వీడియో డిస్ ప్లే వాల్‌పై యువ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు ప్రజంటేషన్లు ఇచ్చారు. ఆర్టీజీఎస్ ప్రత్యేక అధికారులు ధాత్రిరెడ్డి, మలికా గార్గ్, ప్రఖర్ జైన్, సౌరబ్ గౌర్, సురేశ్ కుమార్‌లు ప్రజంటేషన్ల ద్వారా డేటా లేక్, అవేర్ 2.0, వాట్సప్ గవర్నెన్స్, పీపుల్స్ పర్సెప్షన్, ఏజెంట్ స్పేస్ ఏఐ సెర్చ్ బార్, సంజీవని, అమరావతి ప్రాజెక్టుల గురించి వివరించారు. ఆర్టీజీఎస్ కేంద్రంలో జరిగిన ప్రజంటేషన్ల కార్యక్రమంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్, సీఎస్ కె.విజయానంద్ సహా తదితర అధికారులు పాల్గొన్నారు.

## డిజిటల్ విప్లవంలో చంద్రబాబుది కీలక పాత్ర

-మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్ ఐటీ రంగంలో మేటిగా నిలబడిందన్నారు. రాష్ట్ర విభజన అనంతరం తాను ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కోసం పనిచేస్తున్నానని ముఖ్యమంత్రి చెప్పారు. ఏపీలో వనరులకు లోటు లేదని, సంపద సృష్టి జరగాల్సి ఉందన్నారు. గేట్స్ ఫౌండేషన్ సహకారంతో 2047 నాటికి రాష్ట్రాన్నినెంబర్‌వన్ చేస్తామనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. సమావేశంలో మాట్లాడిన బిల్ గేట్స్...డిజిటల్ విప్లవానికి భారత్‌లో బలమైన పునాదులు ఉన్నాయని అభిప్రాయపడ్డారు. భారతదేశ డిజిటల్ విప్లవంలో ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు నాయుడు కీలక పాత్ర పోషిస్తున్నారని కితాబిచ్చారు. తాను మొదటిసారి చంద్రబాబును కలిసినప్పుడు ఆయన ఆలోచనల్లో ముందుచూపు ఉందనే విషయాన్ని ఆనాడే గ్రహించినట్టు వెల్లడించారు. ఈ విషయంలో నాటి సింగపూర్ ప్రధాని మాత్రమే చంద్రబాబుకు కొంత దగ్గరగా ఉన్నారని చెప్పారు. గేట్స్ ఫౌండేషన్ చేపడుతున్న కార్యక్రమాల్లో ఆరోగ్య రంగానికి చెందిన ప్రాజెక్టులే మెజార్టీ ప్రాజెక్టులని తెలిపారు. ఆరోగ్య సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలన్నది తన ఆశయమన్నారు. కుప్పంలో అమలు చేస్తున్న సంజీవని కార్యక్రమం అద్భుతంగా ఉందని అభినందించారు. విద్యార్థుల సమస్యలను అర్థం చేసుకోవడానికి, వారికి సరైన రీతిలో... తగిన స్థాయిలో విద్యా బోధన చేయడానికి ఏఐ సహాయపడుతుందన్నారు. విద్యారంగంలో మార్పు తీసుకురావడానికి ఏఐ-టెక్నాలజీ ఉపయోగపడుతుందని చెప్పిన బిల్ గేట్స్, వ్యవసాయం రంగం చాలా ముఖ్యమైనదిగా అభిప్రాయపడ్డారు. టెక్నాలజీ సాయంతో ఏపీ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేయడం...టెక్నాలజీని రైతులకు అందించేందుకు... ఏఐను వ్యవసాయంతో ఇంటిగ్రేట్ చేస్తూ కృషి చేయడాన్ని అభినందించారు. అభివృద్ధి చెందిన దేశాల్లో కూడా వ్యవసాయంలో ఏఐని ఇంతలా వినియోగంచడం లేదని... కానీ ఆంధ్రప్రదేశ్ ఈ విషయంలో ముందుండటం మంచి పరిణామమని చెప్పారు. విపత్తుల నిర్వహణ కోసం టెక్నాలజీతో ముందస్తు అంచనాలు వేసి... ప్రాణ నష్టం జరగ్గకుండా జాగ్రత్తలు తీసుకునే వ్యవస్థ ఏర్పాటు చేయడం బాగుందన్నారు. చంద్రబాబు తనకు గుడ్ ఓల్డ్ ఫ్రెండ్ అని సమావేశంలో బిల్ గేట్స్ సరదాగా వ్యాఖ్యానించారు. స్వర్ణాంధ్ర-2047 నాటికి ముఖ్య లక్ష్యాలు నిర్దేశించుకున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. 'ప్రస్తుతం 180 బిలియన్ డాలర్లుగా ఉన్న రాష్ట్ర ఎకానమీని 2.4 ట్రిలియన్ డాలర్ల జీఎస్డీపీగా తీర్చిదిద్దడం, తలసరి ఆదాయం ప్రస్తుతం 3,400 డాలర్లు ఉండగా 2047 నాటికి దీనిని 42,000 డాలర్లకు పెంచడం, ఎగుమతులు 20.7 బిలియన్ డాలర్ల నుంచి 450 బిలియన్ డాలర్లకు పెంచడం, నిరుద్యోగితను 4.1 శాతం నుంచి 2 శాతం కన్నా తగ్గించడం, మహిళా కార్మికుల సంఖ్యను 45.8 శాతం 80 శాతానికి పెంచడం, ప్రస్తుతం 72 శాతంగా ఉన్న అక్షరాస్యతను 100 శాతానికి తీసుకువెళ్లడం, 95 శాతం నైపుణ్యం కలిగిన మానవ వనరులు ఉండేలా చూడటం, సగటు ఆయుర్ధాయం 85 ఏళ్లు, ఎంఎంఆర్ ప్రతీ లక్ష జననాలకు 5, ఐఎంఆర్ ప్రతీ వెయ్యి జననాలకు 2 కన్నా తగ్గించగలగడం, గర్భిణులలో రక్తహీనత సమస్య, వైద్యంపై వ్యక్తిగత ఖర్చు 5 శాతానికి తగ్గించడమే లక్ష్యం'గా సీఎం చెప్పారు.

**సీనియర్ ఐఏఎస్ అధికారి బాబు ఏ అడిగిన ఓ ప్రశ్నకు సమాధానంగా... ఏఐ**

రాకతో ఉద్యోగాలను పునర్నిర్వచించాల్సిన అవసరం ఉందని బిల్ గేట్స్ అభిప్రాయపడ్డారు. అలాగే ఈ వారం ఢిల్లీలో జరుగుతున్న

ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్‌లో కూడా ఏఐ వల్ల వచ్చే అవకాశాలు, ఎదురయ్యే సవాళ్ల గురించి ప్రపంచంలోని ఏఐ నిపుణులంతా చర్చిస్తారని గేట్స్ వివరించారు.ఖ


## భారత డిజిటల్ విప్లవంలో మోదీ, చంద్రబాబు కీలకపాత్రధారులు

-మొదటిపేజీ తరువాయి

ముఖ్యమంత్రి చంద్రబాబు, మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్‌తో పాటు తాను, ఇతర మంత్రులు కలిసి ఉన్న చిత్రాన్ని జతచేశారు. ఈ రెండు చిత్రాలను పోలుస్తూ ఆయన పైవిధంగా వ్యాఖ్యానించారు. సోమవారం అమరావతి సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో బిల్ గేట్స్ సమావేశమయ్యారు. ఈ భేటీలో రాష్ట్ర మంత్రులు, ప్రభుత్వ ఉన్నతాధికారులతో పాటు మంత్రి పార్థసారథి కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బిల్ గేట్స్ మాట్లాడుతూ, భారతదేశ డిజిటల్ విప్లవంలో ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కీలక పాత్ర పోషిస్తున్నారని ప్రశంసించారు. ముఖ్యంగా డిజిటల్ గవర్నెన్స్, విపత్తుల నిర్వహణలో టెక్నాలజీని సమర్థవంతంగా వినియోగించడంలో చంద్రబాబు చేస్తున్న కృషిని బిల్ గేట్స్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కీలక సమావేశం జరిగిన నేపథ్యంలోనే మంత్రి పార్థసారథి చేసిన పోస్ట్ రాజకీయంగా చర్చనీయాంశమైంది.

## అంబటి రాంబాబు కస్టడీ, బెయిల్ పిటిషన్లపై తీర్పు రిజర్వ్

-మొదటిపేజీ తరువాయి



మంజూరు చేయాలని కోర్టును కోరారు. పోలీసుల తరఫున న్యాయవాది తన వాదనలు వినిపిస్తూ... అంబటి రాంబాబు లాటరీ పేరుతో డబ్బులు వసూలు చేసి మోసం చేశారని... పూర్తి స్థాయి విచారణ కోసం పోలీస్ కస్టడీ అవసరమని కోర్టును కోరారు. ఇరు పక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి బెయిల్, పోలీస్ కస్టడీ పిటిషన్లపై తీర్పును రిజర్వ్ చేశారు. ఈ కేసులో కోర్టు ఏ నిర్ణయం తీసుకుంటుందన్నది రాజకీయ వర్గాల్లో ఆసక్తిగా మారింది.

# ప్రశాంతంగా కాటకోటేశ్వరస్వామి బ్రహోత్సవాలు

- 10రోజులుగా శ్రమించి అందర్నీ ఏకతాటిపైకి తెచ్చిన శ్రీరామ్
- చాలా ఏళ్ల తర్వాత సాంప్రదాయ పద్ధతిలో ఐక్యంగా ఉత్సవాలు





**అంకుశం న్యూస్ ధర్మవరం ఫిబ్రవరి 16:** గత కొన్నేళ్లుగా వివాదాలు, ఉద్రిక్తతలకు కేంద్రంగా మారిన చిల్లవారిపల్లి కాటకోటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు.. ఈసారి ధర్మవరం తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి పరిటాల శ్రీరామ్ చొరవతో ప్రశాంత వాతావరణంలో జరిగాయి. తాడిమర్రి మండలం చిల్లవారిపల్లి సమీపంలో శ్రీ కాటకోటేశ్వరస్వామి క్షేత్రంలో మహాశివరాత్రి సందర్భంగా బ్రహ్మోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. రెండు రోజుల పాటు కొన్ని గ్రామాల ప్రజలు, పలు సామాజిక వర్గాల వారు సాంప్రదాయ పద్ధతిలో ఉత్సవాలు నిర్వహిస్తుంటారు. అయితే గత కొన్నేళ్లుగా ఉత్సవాల నిర్వహణలో విబేధాలు వచ్చాయి. దీంతో కొన్ని గ్రామల మధ్య, సామాజిక వర్గాల మధ్య వైషమ్యాలు ఏర్పడి. చాలా సార్లు ఘర్షణలు జరిగి.. ఉద్రిక్త పరిస్థితులు కనిపించేవి. ఈ పరిస్థితిని గమనించిన పరిటాల శ్రీరామ్ గత ఏడాదిలోనే అందర్నీ ఏకతాటిపైకి తెచ్చే ప్రయత్నం చేశారు. ఈసారి వేడుకలకు 10రోజుల ముందు నుంచే శ్రీరామ్ స్వయంగా రంగంలోకి దిగి.. అభ్యంతరాలు చెబుతున్న వారితో మాట్లాడారు. గ్రామాల పెద్దల్ని, ఆలయ పూజార్లందర్నీ ఏకతాటిపైకి తీసుకొచ్చారు. దీనికి తోడు డీఎస్పీ హేమంత్ కుమార్ కూడా ప్రత్యేకంగా దృష్టి సారించి ఈ విషయంలో చొరవ చూపారు. దీంతో రెండు రోజుల పాటు నిర్వహించిన వేడుకలు ప్రశాంతంగా ముగిసాయి. ఆదివారం చిల్లవారిపల్లి నుంచి స్వామివారి ఆభరణాలను గుర్రాలపై, ఎలవగంపలో ఉంచి కాటకోటేశ్వర క్షేత్రానికి బయలు దేరి సోమవారం తెల్లవారు జామునకు కాటకోటేశ్వర క్షేత్రానికి చేరుకున్నాయి. అనంతరం మధ్యాహ్నం స్వామి వారి గుర్రములతో భక్తుల అగ్నిగుండ ప్రవేశం ఘనంగా జరిగింది. ఈవేడుకల్ని తిలకించడానికి శ్రీసత్యసాయి, అనంతపురం, కడప జిల్లాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. ఉత్సవాల వివాదాల నేపథ్యంలో ఎస్పీ సతీశ్ కుమార్ ఆధ్వర్యంలో భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఉత్సవాలు ప్రశాంతంగా ముగియడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈసందర్భంగా శ్రీరామ్ మాట్లాడుతూ గతంలో సాంప్రదాయబద్ధంగా అందరూ ఐక్యంగా ఉత్సవాలు నిర్వహించుకునే వారన్నారు. అయితే దురదృష్టవశాత్తు కొన్ని విబేధాలు రావడంతో అనుకోని సంఘటనలు జరిగాయన్నారు. ఈసారి ఇలాంటి వాటికి తావివ్వకూడదని పెద్దలందరితోను మాట్లాడామన్నారు. అందరూ ఐక్యంగా ఉత్సవాల నిర్వహణకు ముందుకు రావడం మంచి పరిణామమన్నారు. ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ శ్రీరామ్ కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా ఇందులో పోలీస్ శాఖ వారు సుమారు వారం రోజులుగా ఇక్కడే ఉండి.. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా చేశారన్నారు. జిల్లా ఎస్పీ సతీష్ కుమార్, డీఎస్పీ హేమంత్ కుమార్ కి గ్రామస్థులందరి తరుపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఇక నుంచి చిల్లవారిపల్లి కాట కోటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రశాంతంగా, ఒక ఆధ్యాత్మిక వాతావరణంలో కొనసాగుతాయని శ్రీరామ్ ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఆర్డీటీ రక్షణ కోసం ఆందోళనలు ఉధృతం చేస్తాం

- 17న కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల ముట్టడి



**అంకుశం న్యూస్ అనంతపురం ఫిబ్రవరి 16:** ఆర్డీటీ సాధించుకోవడమే లక్ష్యంగా దశల వారి ఉద్యమాలకు సిద్ధం కావాలని ఆర్డటీ అఖిలపక్ష కమిటీ కన్వీనర్ సాకే హరి పిలుపునిచ్చారు.సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందున్న ఫాదర్ విన్సెంట్ టెర్రర్ విగ్రహం దగ్గర సాకే హరి విలేకరులతో మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఆర్డీటీ ఎఫ్ సి ఆర్ఏ రెన్యువల్ అంశంపై నిర్లక్ష్యాన్ని పూర్తిగా తప్పుపట్టారు. ఆర్డీటీని కాపాడుకోవడం లక్ష్యంగా మంగళవారం కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల ముట్టడిని విజయవంతం చేయాడానికి ఉదయం 10 గంటలకు క్లాక్ టవర్ సెంటర్ కి కుల,మత పార్టీలకతీతంగా ఐక్యంగా ముందుకు రావాలని కోరారు. ఉమ్మడి జిల్లాతో పాటు కర్నూల్, తెలంగాణ రాష్ట్రంలో పేద ప్రజలకు అన్ని రంగాల్లోనూ సేవలు చేయడంతో ఎంతో అభివృద్ధి చెందారన్నారు. ముఖ్యంగా వైద్యం,విద్య సేవలు మరువలేమన్నారు. ఎఫ్ సి ఆర్ ఏ రిజిస్ట్రేషన్ చేయాలని ఇప్పటికే కుల,ప్రజా సంఘాలు రాజకీయ,వామ పక్ష పార్టీలు ప్రజాస్వామిక అభ్యుదయవాదులు ఆర్డిటి అభిమానులు వివిధ రకాలుగా పోరాటాలు చేశారని అయినప్పటికీ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలలో చలనం లేకపోయిందన్నారు.ఆర్డీటీని దూరం చేస్తే పేద ప్రజల్లో ఉద్యమ తీవ్రత పెరిగి కూటమి ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తి కలుగుతుందన్నారు.ఇప్పటికే ఆర్డీటీ లేకుండా చేస్తున్నారని ప్రజల్లో ఆందోళన వ్యతిరేకత వ్యక్తపరుస్తున్నారు.ఆర్డీటీ ఎఫ్ సి ఆర్ ఏ వెంటనే రెన్యువల్ చేసి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మాట నిలబెట్టుకోలేకపోతే అనేక నష్టాలు చవి చూస్తారన్నారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు మాల మహానాడు జిల్లా అధ్యక్షులు సుగామంచి శ్రీనివాసులు,ఐ ఐ ఎం భాష,బేడ బుడగ జంగం శిరీషాల అంజి,దివ్యాంగుల హక్కుల పోరాట సమితి హరినాథ్ రెడ్డి,సంపత్ కుమార్, నవయువ సమాఖ్య విశ్వనాథ్, రాయలసీమ విద్యావంతులు వేదిక వెంకటేష్, గ్రామీణ పేదల సంఘం ఓబులేసు జేఏసీ నాయకులు ఓబులేసు, సూర్యనారాయణ, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# పరిటాల ట్రస్ట్ ఆధ్వర్యంలో దేశవాళి ఎద్దులతో రాతి దూలం లాగుడు పోటీలు

- ఉత్సాహంగా సాగిన పోటీలు.. బహుమతుల ప్రదానం చేసిన సునీత
- తాగునీటి సమస్య, గ్రామాల్లో సమస్యలపై చర్చ





**అంకుశం న్యూస్ అనంతపురం ఫిబ్రవరి 16:** ఇటీవల కాలంలో దేశవాళి పశువులు కనిపించకుండా పోతున్నాయని.. వీటిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. ఆత్మకూరు మండలం బి.యాలేరు గ్రామంలో మహా శివరాత్రి సందర్భంగా పరిటాల రవీంద్ర మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దేశవాళి రాతి దూలం లాగుడు పోటీలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున ఎద్దులతో ఈ పోటీలకు తరలివచ్చారు. గ్రామంలో ఎంతో ఆహ్లాదకరమైన వాతావరణంలో ఈ పోటీలు సాగాయి. పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన వారికి పరిటాల ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశారు. ముగింపు దశలో పోటీలను ఎమ్మెల్యే పరిటాల సునీత వీక్షించారు. ముందుగా గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే సునీతకు గ్రామస్థులు, రైతులు, టీడీపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. నాగ నందీశ్వర దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం పోటీలను వీక్షించారు. ఈ పోటీల్లో విజేతలకు ఎమ్మెల్యే సునీత చేతుల మీదుగా బహుమతుల ప్రదానం జరిగింది. మొదటి బహుమతి కర్నూలు జిల్లా జొన్నగిరి మండలంకి చెందిన అద్దంకి మస్తానీ యాదవ్ 30వేలు, 2వ బహుమతి విడపనకల్లు మండలం పెంచలపాడుకు చెందిన రాకెట్ల బీమ లింగప్పకు 25వేలు, 3వ బహుమతిబొమ్మనహాళ్ మండలం లింగదాలకు చెందిన ఎర్రి స్వామికి 20వేలు, 4వ బహుమతి బొమ్మనహాళ్ మండలం ఉద్దేహాల్ కు చెందిన బసన్నకు 15వేలు, 5వ బహుమతి ఉరవకొండ మండలం కౌకుంట్లకు చెందిన గాలి సీనప్పకు 10వేలు, 6వ బహుమతి వజ్రకరూరు మండలం ధర్మపురికి చెందిన అజిత్ కుమార్ కు 8వేలు, 7వ బహుమతి కర్నూలు జిల్లా పత్తికొండ మండలం పులికొండ గ్రామానికి చెందిన మాధవరాజుకు 5వేలు, 8వ బహుమతి ఆత్మకూరు మండలం బి.యాలేరుకు చెందిన నాగరాజుకు 3వేల రూపాయల చొప్పున ప్రదానం చేశారు. పోటీల్లో పాల్గొన్న దేశవాళి ఎద్దుల యజమానులకు సన్మానం చేసి రెండు రాగి గ్లాసులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి సాంప్రదాయ పోటీలు నిర్వహించడం వలన మంచి స్నేహపూర్వక వాతావరణ ఉంటుందన్నారు. అలాగే పశువుల పెంపకాన్ని ప్రోత్సహించినట్టు అవుతుందన్నారు. ముఖ్యంగా దేశవాళి పశువుల వలన ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని.. ఇటీవల ఇతర జాతి పశువుల పెంపకం ఎక్కువగా చూస్తున్నామన్నారు. పాడి రైతులందర్నీ దేశవాళి ఆవుల పెంపకం చేపట్టేలా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు.

**- గ్రామాల్లో ఎక్కడా నీటి సమస్య రానివ్వద్దు.. ఎమ్మెల్యే సునీత**

వేసవి కాలం నేపథ్యంలో గ్రామాల్లో ఎక్కడా తాగునీటి సమస్య లేకుండా చూడాలని అధికారులను ఎమ్మెల్యే పరిటాల సునీత ఆదేశించారు. అనంతపురంలోని తన క్యాంప్ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓలు, డిప్యూటీ ఎంపీడీఓలు, ఆర్డబ్ల్యూఎస్ ఇంజనీర్లు ఈ సమావేశంలో పాల్గొన్నారు. గ్రామాల్లో ఎక్కడెక్కడ నీటి సమస్య ఉందని ఎమ్మెల్యే సునీత ఆరా తీశారు. రానున్న మూడు నెలల్లో ఎక్కడైన సమస్యలు వచ్చే అవకాశం ఉందా.. వస్తే ఎలాంటి చర్యలు తీసుకోవాలన్న అంశాల గురించి చర్చించారు. ఎక్కడైనా నిధులు అవసరమైతే తన దృష్టికి తీసుకురావాలన్నారు. వెంటనే ప్రభుత్వంతో మాట్లాడి నిధులు తీసుకొస్తామన్నారు. దీనిపై ఎక్కడా నిర్లక్ష్యం వహించవద్దన్నారు. అలాగే గ్రామాల వారిగా ఏమైనా పనులు పెండింగ్ లో ఉన్నాయా అన్నది కూడా ఒక నివేదిక సిద్ధం చేయాలన్నారు. ఇప్పటికే జరుగుతున్న పనుల గురించి ఎంపీడీఓలనడిగి వివరాలు తెలుసుకున్నారు...

## మహాశివరాత్రి సందర్భంగా శివోహం అంటూ శైవ క్షేత్రాలు



**తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ ఫిబ్రవరి 16:** అనపర్తి స్థానిక శ్రీ ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి పురస్కరించుకుని పంచామృత అభిషేకములు బిల్వదల అర్చన భారీ క్యూ లైన్ ద్వారా భక్తులు దర్శనం చేసుకునే విధంగా ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆలయ చైర్మన్ ఆధ్వర్యంలో మధ్యాహ్నం కర్రి పుత్రారెడ్డి రామ సీత డైరీ ఫార్మ్ వారి సౌజన్యంతో భారీ అన్న సమారాధన నిర్వహించగా భారీ సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. సాయంత్రం నుండి తెల్లవారుజాము వరకు లింగోద్వ అభిషేక పూజలు ఘనంగా నిర్వహించారు. వచ్చిన భక్తులులకు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ చైర్మన్ ను అభినందించారు. భక్తులకు కు ఎటువంటి అసౌక్యం కలగకుండా పోలీస్ శాఖ సిఐ సుమంత్ పరివేక్షణలో ఎస్సై శ్రీను నాయక్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేసారు. ఆరోగ్యశాఖ వారు మెడికల్ క్యాంపులు నిర్వహించారు. స్వచ్ఛందంగా భక్తులు సహాయసహకారాలు తో ఆలయ కార్యక్రమాల్లో తమ వంతు సేవలు అందించారని చైర్మన్ పోతంశెట్టి శ్రీనివాసరెడ్డి తెలియజేశారు.

## శ్రీకృష్ణ దేవరాయలు జీవితం ఎందరికో ఆదర్శం. జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి



**అంకుశం న్యూస్ ధర్మవరం ఫిబ్రవరి 16:** శ్రీకృష్ణదేవరాయలు జీవితం ఎందరికో ఆదర్శమని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారు పట్టణంలోని బస్టాండ్ వద్ద గల శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి వారి జయంతి సందర్భంగా పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ తెలుగు భాషకు ఆంధ్రుల గౌరవానికి వారు చేసిన సేవలు చిరస్మరణీయమని తెలిపారు. రాయలు జీవితము నుంచి ప్రేరణ పొందాలని సమాజ అభివృద్ధి కోసం కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమములో కూడా వారు పాల్గొని అందరికీ అన్నదానం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## వృద్ధులు,వికలాంగులకు తప్పని రేషన్ "తిప్పలు"

- రేషన్ దుకాణాల వైపు కన్నెత్తి చూడని అధికారులు





**తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ ఫిబ్రవరి 16:** వృద్ధులు,వికలాంగులకు ఇంటికే సరుకులు పంపిణీ అని కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ నియోజకవర్గ కేంద్రం అనపర్తి ఏడవ వార్డులో అటకెక్కింది. ప్రభుత్వం స్పష్టమైన ఆదేశం ఇచ్చినప్పటికీ అది ఆదిలో హంసపాదు అన్న చందంగా తయారైంది.మంచం మీద నుండి లేవలేని వారికి,వృద్ధులు, వికలాంగులకు ఇంటికే సరుకులు అనే పంపిణీ కార్యక్రమం సక్రమంగా కొనసాగడం లేదు.ముఖ్యంగా అనపర్తి ఏడవ వార్డు లో గత నాలుగు నెలలుగా షాపుకు రాలేని వారికి రేషన్ సరుకులు పంపిణీ చేయలేదు.సాధారణంగా ఒకటో తేదీ నుండి 15 వ తేదీ వరకు రేషన్ సరుకులు పంపిణీ ఐచేయాల్సినప్పటికీ కేవలం 10 వ తేదీ వరకు మాత్రమే ఇవ్వడం జరుగుతుందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.ఇక ముఖ్యంగా అంతకు ముందు వి ఆర్ ఓ వేలి ముద్ర వేస్తే వారి తరపు వారికి షాపు వద్ద రేషన్ ఇవ్వడం జరిగేది.అయితే డీలర్ ని ఈ విషయం పై గతంలో ఒకసారి వివరణ అడగ్గా గతంలో ఉన్న విఆర్వో బదిలీ కావడం జరిగిందని ఇప్పుడు ఉన్న వీఆర్వో వేలుముద్ర వేసినా అవ్వడం లేదని పాత విఆర్ఓ పేరునే ఉండటం వలన షాపుకు రాలేని వారికి రేషన్ ఇవ్వలేక పోతున్నామని చెప్పడం గమనార్హం.గత నాలుగు నెలలుగా రేషన్ సరుకులు ఇవ్వకపోవడంతో రేషన్ కార్డు పోతుందేమోనని ఇలా జరిగితే పింఛను పోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఏడవ వార్డు పరిధిలో ఉన్న లేవలేని వారికి ఒకరిద్దరు వృద్ధులు, వికలాంగులకు పంపిణీ చేయకుండా రేషన్ పంపిణీదారులు నిర్లక్ష్యం వహిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి.పై స్థాయిలో అన్ని సక్రమంగా జరిగి పోతున్నాయని అనుకోవడమే తప్ప కింది స్థాయి లో ప్రజలకు సక్రమరీతులో పథకాలు చేరడం లేదని అసంతృప్తి పలువురు వ్యక్తం చేస్తున్నారు.ముఖ్యంగా అనేక చోట్ల తూకం బయటకు కనపడకుండా లోపల తూకం తూచి రేషన్ లబ్ధిదారులకు రేషన్ బియ్యం ఇవ్వడం జరుగుతుందని దీంతో తూకం లో తేడా వస్తుందనే విమర్శలు తలెత్తుతున్నాయి. అన్నీ ఉన్న అల్లుడు నోట్లో శని అన్నట్టు రేషన్ కార్డు ఉన్న రేషన్ సరుకులు మాత్రం అందకపోవడం గమనార్హం.వీటిపై దృష్టి సారించాల్సిన అధికారులు రేషన్ దుకాణాల వైపు మాత్రం కన్నెత్తి కూడా చూడకపోవడం పట్ల ప్రజల్లో అనేక అనుమానాలు వ్యక్తమౌతున్నాయి.ఇప్పటికైనా స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు సంబంధిత అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.


## 24 గంటల దీక్షలో గుడి ప్రదక్షిణ చేసిన శివభక్తుడు చింతకాయల శ్రీనివాసులు.



**అంకుశం న్యూస్ ధర్మవరం ఫిబ్రవరి 16:** ధర్మవరం పట్టణానికి చెందిన చింతకాయల శ్రీనివాసులు గత మూడు సంవత్సరాలుగా శివరాత్రి పండుగను పురస్కరించుకొని పట్టణంలోని మొదటి మరువ చెరువు కట్ట వద్ద గల కాశీ విశ్వనాథ ఆలయంలో ఆదివారం సాయంత్రం ఐదు గంటల నుండి సోమవారం తెల్లవారుజామున 5 గంటల వరకు నిరంతర ప్రక్రియగా గుడి చుట్టూ ఆపకుండా శివ భక్తుడు చింతకాయల శ్రీనివాసులు గుడి ప్రదక్షణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాను 2023 నుండి 2026 వరకు అనగా 4 సంవత్సరాల పాటు గుడి ప్రదక్షణ చేస్తున్నానని, నిలపకుండా గుడి చుట్టూ తిరగడం నాకు భగవంతుడు ఇచ్చిన వరము అని వారు సంతోషాన్ని వ్యక్తం చేశారు. దైవాజ్ఞ లేనిదే ఏ కార్యము చేయలేమని, ఇందులో భాగంగానే నాకు దైవ ఆశీస్సులు సహకారంతోనే ఈ కార్యాన్ని కొనసాగించానని వారు తెలిపారు. తదుపరి ఆలయ కమిటీ వారు చింతకాయల శ్రీనివాసుల్ని ఘనంగా సత్కరించారు. తొలుత ఆ భక్తాదుని పేరిట ప్రత్యేక పూజలు అర్చనలు అర్చకులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తాదులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పదవ తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి..

- : జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్



**అంకుశం న్యూస్ అనంతపురం, ఫిబ్రవరి 16 :** విద్యా శాఖ పరిధిలో పదవ తరగతి, ఓపెన్ స్కూల్ ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో పదవ తరగతి, ఏపీఓఎస్ఎస్ ఇంటర్ పరీక్షల నిర్వహణపై సంబంధిత శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.

- ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పదవ తరగతి, ఓపెన్ స్కూల్ ఇంటర్ పరీక్షలను ఎలాంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించాలన్నారు. పదవ తరగతి, ఇంటర్ పరీక్షలు చాలా ముఖ్యమైనవని, విద్యార్థినీ విద్యార్థులకు అన్ని సౌకర్యాలను కల్పించాలన్నారు. ఎస్ఎస్సి ఎగ్జామినేషన్స్, మార్చి - 2026 పరీక్షలను మార్చి 16వ తేదీ నుంచి మార్చి 31వ తేదీ / ఏప్రిల్ 1వ తేదీ వరకు ఉదయం 09:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:45 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఏపీఓఎస్ఎస్ (ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ సొసైటీ) ఎస్ఎస్సి పరీక్షలను మార్చి నెల 16వ తేదీ నుంచి 28వ తేదీ వరకు ఉదయం 09:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో 592 పాఠశాలలకు చెందిన 33,260 మంది విద్యార్థులు, 71 ఏపీఓఎస్ఎస్ స్కూల్స్ కు చెందిన 1,045 మంది విద్యార్థులు మొత్తం 143 పాఠశాలల్లో పరీక్షలను రాయనున్నారని తెలిపారు. అలాగే ఏపీఓఎస్ఎస్ (ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ సొసైటీ) ఇంటర్మీడియట్ ఎగ్జామినేషన్స్, మార్చి- 2026 కు సంబంధించి 38 ఏపీఓఎస్ఎస్ ఇంటర్మీడియట్ స్కూల్స్ కి చెందిన 2,479 మంది విద్యార్థులు జిల్లాలో 9 కేంద్రాలలో మార్చి 2వ తేదీ నుంచి మార్చి 13వ తేదీ వరకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలను నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు.లిపరీక్షలు జరిగే సమయంలో అవసరమైన ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేయాలన్నారు. పరీక్ష కేంద్రాలలో ఎలాంటి అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని, ఇందుకోసం కంట్రోల్ రూమ్ లను ఏర్పాటు చేసుకొని పర్యవేక్షణ చేయాలన్నారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద ఏఎన్ఎం, ఫస్ట్ ఎయిడ్ కిట్స్ ఖచ్చితంగా ఉండాలని, జిరాక్స్ సెంటర్లను మూసి వేయించాలని, పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. పరీక్ష కేంద్రాలను తనిఖీ చేయాలన్నారు. పరీక్షల నిర్వహణలో ఏవైనా సమస్యలు ఉంటే తెలియజేయాలని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా శాఖల అధికారులు సమన్వయం చేసుకొని పక్కాగా పరీక్షలను నిర్వహించాలన్నారు.లిఈ సమావేశంలో డిఆర్ఓ ఏ.మలోల, డిఈఓ ప్రసాద్ బాబు, ఇంటర్మీడియట్ కన్వీనర్, జిల్లా పరీక్షల నిర్వహణ కమిటి మరియు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి యం.వెంకటరమణ నాయక్, నగర పాలక సంస్థ కమిషనర్ జశ్వంత్ రావు, ఏపీఎస్ఆర్టీసీ ఆర్ఎం శ్రీలక్ష్మి, నగరపాలక సంస్థ ఈఈ షాకీర్, బీసీ వెల్ఫేర్ డిడి కుష్బూ కొఠారి, ఏపీఎస్పీడీసీఎల్ ఏఈ మహబూబ్ భాష, లేబర్ డిసి లక్ష్మీ నరసయ్య, ఆయా శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# చట్ట పరిధిలో పరిష్కారం చూపండి

**- పోలీస్ 72 పిటీషన్లు స్వీకరణ**

**- పిటీషనర్లతో ముఖాముఖి మాట్లాడి పరిష్కారానికి ఆదేశాలు జారీ చేసిన జిల్లా ఎస్పీ పి.జగదీష్**

**- దివ్యాంగురాలి వద్దకే వెళ్లి పిటీషన్ స్వీకరించి పరిష్కారం చూపిన జిల్లా ఎస్పీ జగదీష్**

**- ఇస్కాన్ సహకారంతో ఉచిత భోజన సదుపాయం**

**అంకుశం క్రైమ్ న్యూస్ అనంతపురం ఫిబ్రవరి 16 :** జిల్లా పోలీస్ శాఖ నిర్వహించు ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే ఫిర్యాదులను చట్టపరిధిలో పరిష్కరించాలని ప్రజలందరికీ న్యాయం చేసి పోలీసు ప్రతిష్టను పెంచాలని అనంతపురం జిల్లా ఎస్పీ పి జగదీష్ పోలీస్ అధికారులకు ఆదేశించారుద. అనంతపురం ఎస్పీ పి. జగదీష్ ఈరోజు స్థానిక పోలీస్ కాన్ఫరెన్స్ హాల్లో పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసల్ సిస్టమ్ (PGRS) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ గారు ప్రజల నుండి వివిధ సమస్యలపై అర్జీలను స్వీకరించారు. ప్రజల సమస్యలను శ్రద్ధగా విని, వాటిని





తక్షణమే పరిశీలించి చట్టపరిధిలో పరిష్కరించేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అదేవిధంగా…ఈ కార్యక్రమానికి హాజరైన పిటిషనర్లు మరియు వారి వెంట వచ్చిన వారికి ఇస్కాన్ సంస్థ వారి సహకారంతో ఉచిత భోజన ఏర్పాట్లు చేయడం జరిగింది. పోలీసు అధికారులు పాల్గొని స్వయంగా వారే భోజనం వడ్డించారు. ఈ సందర్భంగా ప్రజలు జిల్లా పోలీస్ యంత్రాంగానికి మరియు ఇస్కాన్ సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ పిజిఆర్ఎస్ కార్యక్రమంలో అనంతపురం మహిళా డీఎస్పీ మహబూబ్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

**- : జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్**

**అంకుశం న్యూస్ అనంతపురం, ఫిబ్రవరి 16 :** ఈ నెల 17వ తేదీన నిర్వహించే జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, ఈ కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమం (నేషనల్ డీ వార్మింగ్ డే) నిర్వహణపై సంబంధిత శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. అనంతరం జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం నిర్వహణకు సంబంధించిన పోస్టర్లను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు.

- ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పిల్లలకు చదువుతోపాటు మంచి ఆరోగ్యం కూడా చాలా అవసరం అని, విద్యార్థినీ విద్యార్థులు ఆరోగ్యవంతంగా ఉండడం కొరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 17, 24న చేపట్టిన జాతీయ నులిపురుగుల నిర్మూలనా కార్యక్రమమును జిల్లా వ్యాప్తంగా విజయవంతం చేయాలన్నారు. జిల్లాలో 1 - 19 ఏళ్ల మధ్యనున్న 5,99,852 మంది చిన్నారులకి ఆల్బెండజోల్ మాత్రలను అందించాలన్నారు. జిల్లాలోని అంగన్వాడీ, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, బడి బయటి పిల్లలు, బడి బయట కౌమార





దశలో పిల్లలు, ఐటిఐ, పాలిటెక్నిక్, ఒకేషనల్, నర్సింగ్, డిగ్రీ ప్రభుత్వ మరియు ప్రైవేటు సంస్థలు, సంక్షేమ హాస్టళ్లు, గురుకుల పాఠశాలలోని వారు అందరికీ ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయాలని, ఇందుకు అనుగుణంగా ప్రణాళికా బద్ధంగా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా విద్యా శాఖ అధికారి, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి, డివిఈఓ, డిఎంహెచ్ఓ, తదితర సంబంధిత అధికారులను అప్రమత్తంగా ఈ కార్యక్రమాన్ని అమలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసే కార్యక్రమం ముందస్తుగా అందేలా చూడాలని, అలాగే జిల్లాలో ఈనెల 17వ తేదీన అన్ని పాఠశాలలు ఇంటర్మీడియట్ ఒకేషనల్ అంగన్వాడి తదితర కేంద్రాల్లో ఆల్బెండజోల్ మాత్రలను పిల్లలకు భోజనం చేసిన తర్వాత 1-2 సం.లోపు పిల్లలకు చప్పరించే ఆల్బెండజోల్ 400 ఎం.జి మాత్రలో సగం, 2-19 సం. ల లోపు వారికి మింగించాలన్నారు.

ఈ సమావేశంలో డిఆర్ఓ మలోల, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.ఈబి.దేవి, ఐడిఎస్పీ నోడల్ ఆఫీసర్ డా.సురేంద్రరెడ్డి, ఆర్బీఎస్కే నోడల్ అధికారి డా.విష్ణుమూర్తి, డిస్ట్రిక్ట్ ప్రోగ్రాం ఆఫీసర్ ఆర్బీఎస్కే రజిత, పశుసంవర్ధక శాఖ జెడి ప్రేమ్ చంద్, నగర పాలక సంస్థ కమిషనర్ జశ్వంత్ రావు, డిఎంఓ ఓబులు, డిఈఓ ప్రసాద్ బాబు, ఇంటర్మీడియట్ కన్వీనర్, జిల్లా పరీక్షల నిర్వహణ కమిటి మరియు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి యం.వెంకటరమణ నాయక్, ఆయా శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే దగ్గుపాటితో కమిషనర్ మర్యాదపూర్వక భేటీ

**- పారిశుద్ధ్యంపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని ఆదేశం**



**అంకుశం న్యూస్ అనంతపురం, ఫిబ్రవరి 16 :** నగరపాలక సంస్థలో అవినీతి అన్న మాట వినిపించకుండా పని చేయాలని నూతన కమిషనర్ జశ్వంత్ రావుకు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సూచించారు. ఇటీవల కమిషనర్ గా బాధ్యతలు స్వీకరించిన జశ్వంత్ రావు ఎమ్మెల్యే దగ్గుపాటితో ఆయన క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా భేటి అయ్యారు. ఈ సందర్భంగా నగరంలో ప్రజా సమస్యలపై చర్చించారు. టౌన్ ప్లానింగ్, శానిటేషన్ విభాగాల మీద ప్రత్యేకంగా ప్రస్తావించారు. నగరంలోని శివారు కాలనీలతో సహా అన్ని చోట్లా పారిశుద్ధ్యంపై మెరుగైన సేవలందించాలన్నారు. ప్రజల నుంచి ఫిర్యాదులు వచ్చిన వెంటనే స్పందించాలన్నారు. సిబ్బంది పని తీరు మీద ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. నగరపాలక సంస్థలోని ఏ విభాగంలో కూడా అవినీతి అన్న ఆరోపణలు కూడా ఉండకూడదన్నారు. ప్రజలకు మెరుగైన సేవలందించడంలో ఎక్కడా రాజీ పడవద్దని ఎమ్మెల్యే ఆదేశించారు.

## అనపర్తిలో కోటి 78 లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే నల్లమిల్లి

**- అనపర్తి,దుప్పలపూడి గ్రామాలలో సిసి రోడ్లు,బిటి రోడ్లు,మెటల్ రోడ్లు మొదలైన పనులకు శంకుస్థాపనలు**

**- అభివృద్ధి పనులతో అనపర్తి నియోజకవర్గం కళకళ**

**- గత ప్రభుత్వంలో వెలవెలబోయిన అభివృద్ధి**



**తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ ఫిబ్రవరి 16:** అనపర్తిలో 1 కోటి 53 లక్షలు రూపాయలు మరియు దుప్పలపూడిలో 25 లక్షల రూపాయలతో నిర్మించబోయే సీసీ రోడ్ల,మెటల్ రోడ్లు,డ్రెయిన్స్,పైప్ లైన్లు నిర్మాణానికి శంకుస్థాపన చేసిన అనపర్తి శాసనసభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి. ఈ కార్యక్రమంలో అధికారులు, అనపర్తి నియోజకవర్గం, అనపర్తి మండల కూటమి నాయకులు, అనపర్తి టౌన్ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పరమశివుని సేవలో ఎమ్మెల్యే పరిటాల సునీత

**- తన నివాసంలో స్పటిక లింగానికి ప్రత్యేక పూజలు**

**- నసనకోటలోని పురాతన శివాలయాన్ని దర్శించుకున్న ఎమ్మెల్యే**





**అంకుశం న్యూస్ అనంతపురం ఫిబ్రవరి 16:** మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత పరమేశ్వరుని సేవలో గడిపారు. రామగిరి మండలం వెంకటాపురంలోని తన నివాసంలో పరమేశ్వరుని స్పటిక లింగానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుటుంబసభ్యులతో కలిసి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం నసనకోట గ్రామంలోని పురాతన శివాలయానికి వెళ్లారు. అక్కడ గ్రామస్థులు, టీడీపీ నాయకులతో కలిసి పరమేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ తర్వాత ఆలయం వద్ద ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆ మహాదేవుని ఆశీస్సులతో రాప్తాడు నియోజకవర్గ ప్రజలు, రాష్ట్ర ప్రజలు సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. పేరూరు జలాశయానికి నీరందించే పనులు త్వరగా పూర్తై..ఈ ప్రాంతానికి కృష్ణజలాలు త్వరగా అందాలని కోరుకున్నారు.

# - ధర్మవరం లో….జయహో శ్రీ కృష్ణ దేవరాయా!

**- ఘనంగా శ్రీకృష్ణదేవరాయలు 556వ జయంతి వేడుకలు..**

**- రాయలసీమను రతనాల సీమగా శ్రీకృష్ణదేవరాయలు మార్చారు.. కదిరింటి శ్రీరాములు**

**- మనమందరం శ్రీకృష్ణదేవరాయల అడుగుజాడల్లో నడవాలి .. మాసపల్లి సాయికుమార్**





**అంకుశం న్యూస్ ధర్మవరం ఫిబ్రవరి 16:** ధర్మవరంలో శ్రీకృష్ణదేవరాయల 556వ జయంతిని బలిజ సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని బలిజ కళ్యాణమండపం వద్ద నుండి తెరు బజార్, అంజుమాన్ సర్కిల్, పిఆర్టి స్టేట్, కళా జ్యోతి సర్కిల్, కాలేజ్ సర్కిల్, ఆర్టీసీ బస్టాండ్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి పూలమాలవేసి బలిజ సోదరులు నివాళులర్పించారు. ధర్మవరం బలిజ సంఘం తాత్కాలిక అధ్యక్షుడు కదిరింటి శ్రీరాములు మాట్లాడుతూ.. తన పరిపాలనా విధానాలతో కర్ణాటక, ఆంధ్ర ప్రాంతాల అభివృద్ధికి బీజం వేసిన దార్శనికుడు శ్రీకృష్ణదేవరాయులు అని కొనియాడారు. ఆయన పాలన గతించి వందల ఏళ్లు గడుస్తున్నా ఆయన సాధించిన అభివృద్ధి, పరిపాలనలో ప్రవేశపెట్టిన విధానాలు నేటికీ కొనసాగుతుండడం విశేషమన్నారు. రాయలసీమను రతనాల సీమగా శ్రీకృష్ణదేవరాయలు మార్చారన్నారు. మాసపల్లి సాయికుమార్ మాట్లాడుతూ.. దేశభాషలందు తెలుగు లెస్స అని మన మాతృభాష గొప్పదనాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన ఆంధ్రభోజుడు శ్రీకృష్ణదేవరాయలు అని కీర్తించారు. రత్నాలు రాసులుగా పోసి అమ్మినటువంటి ఘన చరిత్ర కేవలం శ్రీకృష్ణదేవరాయల వారికే దక్కింది. అంతే కాకుండా చెరువులు, కుంటలను తవ్వించడం, గొలుసుకట్టు కాల్వల నిర్మాణం ద్వారా వ్యవసాయాన్ని ప్రోత్సహించి దక్షిణ భారత దేశంలో కరువు లేకుండా చేసిన గొప్ప రాజు కృష్ణదేవరాయలు అని కొనియాడారు. ఆయన కాలం నాటి దేవాలయాలు, పురాతన కట్టడాలు నేటికీ చెక్కుచెదరకుండా ఉన్న దేవాలయాలు. కనుకనే నేటికీ గొప్ప పరిపాలనాదక్షుడిగా ప్రపంచ చరిత్రలో చిరస్థాయిగా నిలిచారని అన్నారు. మనమందరం శ్రీకృష్ణదేవరాయల అడుగుజాడల్లో నడవాల్సిన అవసరం ఉందన్నారు. ఫణి కుమార్ మాట్లాడుతూ.. దక్షిణ భారతదేశ చరిత్రలో మధ్యయుగ రాజుల్లో శ్రీకృష్ణదేవరాయలు మహా కీర్తిశాలి అని తెలిపారు. ఆయన పరిపాలనలో పేద బడుగు బలహీన వర్గాల వారికి పూర్తిస్థాయిలో న్యాయం చేస్తూ మంచి పరిపాలకుడిగా పేరు తెచ్చుకున్నారన్నారు. అనంతరం శ్రీకృష్ణదేవరాయల విగ్రహం వద్ద అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో కదిరింటి శ్రీరాములు, మాసపల్లి సాయికుమార్, పసుపులేటి కళ్యాణ్, సంకు అఖిల్, ఫణి కుమార్, సంద్రా రమేష్, అరవింద్, గుండ్లపల్లి ధనుంజయ, పెద్దిరెడ్డి గారి శ్రీనివాసులు, దాసరి సురేష్, శ్యామ్, ఏసీ రాజా, కాశి, కొత్తపేట రవి, సన్ డైరెక్ట్ రమేష్, రామంజి, మహేష్, లోనుకోట బాబు, మిరియాలు అంజి, బలిజ సోదరులు పాల్గొన్నారు.

## ఐలాపురం వెంకయ్యకు అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు



**అంకుశం ప్రతినిధి విజయవాడ, ఫిబ్రవరి 16:** మహాశివరాత్రి పర్వదినాన కన్నుమూసిన ప్రముఖ రాజకీయవేత్త, మాజీ ఎమ్మెల్సీ, బీసీ ఉద్యమ నేత, అజాతశత్రువుగా పేరొందిన ఐలాపురం వెంకయ్య (96)కు సోమవారం సాయంత్రం ఘనంగా అంత్యక్రియలు నిర్వహించారు. తొలుత విజయవాడ సీతారాంపురంలోని ఆయన స్వగృహం నుంచి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, అనుచరులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, వేలాదిమంది ప్రజల అశ్రు నయనాల మధ్య అంతిమయాత్ర ప్రారంభమైంది. ఐలాపురం వెంకయ్య సేవలను స్మరించుకుంటూ పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు నివాళులర్పించారు. దివంగత ఐలాపురం వెంకయ్య జర్నలిస్టు మిత్రులకు ఎంతో సన్నిహితులని సీనియర్ జర్నలిస్టులు నిమ్మరాజు చలపతిరావు, తాళ్లూరి అనిల్ కుమార్ తదితరులు గుర్తుచేసుకుంటూ తమ ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. అలాగే, ఆయన కుమారుడు, మిత్రులు, సమాచార శాఖ మాజీ కమిషనర్ ఐలాపురం రాజాను పరామర్శించి సానుభూతి తెలిపారు.




## ప్రజల సమస్యలను నాణ్యతగా పరిష్కరించాలి

**- జిల్లా కలెక్టర్ ఏ.శ్యాంప్రసాద్**



**అంకుశం ప్రతినిధి పుట్టపర్తి, ఫిబ్రవరి 16:** పిజిఆర్ఎస్ కార్యక్రమం ద్వారా స్వీకరించిన అర్జీలను ప్రజల సంతృప్త స్థాయి పెరిగేలా త్వరితగతిన నాణ్యతగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఏ.శ్యాంప్రసాద్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలు నందు… ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో కలెక్టర్ తో పాటు జాయింట్ కలెక్టర్ ఎం మౌర్య భరద్వాజ్, డిఆర్వో సూర్యనారాయణ రెడ్డి, ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ శ్యాం ప్రసాద్ మాట్లాడుతూ…. పిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు .. క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. అర్జీదారుడు సంతృప్తిచెందేలా నిర్ణీత గడువులోపు అర్జీలను తప్పనిసరిగా పరిష్కరించాలని ఆదేశించారు. పెండింగ్ దరఖాస్తులు, బియాండ్ ఎస్ఎల్ఏ, రీఓపెనింగ్.. లేకుండా అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించాలన్నారు. అనంతరం అర్జీదారులనుండి వారు అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో నేడు మొత్తం 79 అర్జీలు రాగా వాటిపై తగు చర్య తీసుకొని పరిష్కరించు నిమిత్తం సంబంధిత శాఖల అధికారులకు కలెక్టర్ ఎండార్స్ చేయడం జరిగింది.

## శివ పార్వతుల కళ్యాణంలో మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి



**అంకుశం న్యూస్ నంద్యాల ఫిబ్రవరి 16:** నంద్యాల జిల్లా నందుకొట్కూరు నియోజకవర్గం, పగిడ్యాల మండలం పాత ముచ్చుమర్రి గ్రామంలో మహాశివరాత్రి ఉత్సవాలలో భాగంగా సోమవారం తెల్లవారుజామున వేద పండితులు తెలకపల్లి రఘురామశర్మ పర్యవేక్షణలో వైభవంగా శివ పార్వతుల కళ్యాణం జరిగింది. తన సొంత గ్రామం పాత ముచ్చుమర్రి శివాలయంలో జరిగే మహా శివరాత్రి విశేష పూజలకు పూజలకు గ్రామ పెద్దల ఆహ్వానం మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వేద పండితులు తెలకపల్లి రఘురామశర్మ పర్యవేక్షణలో పాత ముచ్చుమర్రి శివాలయంలో మహా శివరాత్రి విశేష పూజలు జరిగాయి. అర్ధరాత్రి 12.4 గంటల సమయంలో మహా అద్భుతంగా లింగోద్భావం, సోమవారం తెల్లవారుజామున 12.45 గంటలకు శివపార్వతుల కళ్యాణం కనులపండువలా నిర్వహించారు. అతిథిగా పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి లింగోద్భవ ప్రత్యేక పూజల్లో, శివపార్వతుల కళ్యాణంలో పాల్గొని స్వామి, అమ్మవార్లకు పూజలు చేసి, దర్శనం చేసుకున్నారు. మహా శివరాత్రి విశేష పూజల్లో గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


## పురుషామృగ వాహనంపై శ్రీ సోమస్కందమూర్తి





**అంకుశం న్యూస్ తిరుపతి ఫిబ్రవరి 16:** తిరుపతి శ్రీ కపిలేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాల్లో తొమ్మిదో రోజైన సోమవారం ఉదయం కామాక్షి సమేత శ్రీ సోమస్కందమూర్తి పురుషామృగ వాహనంపై అనుగ్రహించారు. భజనమండళ్ల కోలాటాలు, భజనలు, మంగళవాయిద్యాల నడుమ పురవీధుల్లో వాహనసేవ కోలాహలంగా జరిగింది. విశేషంగా భక్తులు వాహన సేవకు విచ్చేసి కర్పూర హారతులు సమర్పించారు. కాగా అర్ధరాత్రి 12 నుండి ఉదయం 4 గంటల వరకు లింగోద్భవకాల అభిషేకం నిర్వహించారు. ఉదయం సుప్రభాతం అనంతరం అభిషేకం చేశారు. ఉదయం 8 గంటల నుండి భక్తులకు సర్వదర్శనం ప్రారంభమైంది. ఉదయం 11 గంటల నుండి స్నపన తిరుమంజనం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ సోమస్కందమూర్తి, శ్రీ కామాక్షి అమ్మవారికి పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, గంధం, పన్నీరు, విభూదితో స్నపనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ చంద్రశేఖర్, ఆలయ అర్చకులు,ఇతర అధికారులు, విశేషంగా భక్తులు పాల్గొన్నారు.

## ఎండిఆర్టీ ఏజెంట్లను సన్మానించిన ఎల్ఐసీ బ్రాంచ్ మేనేజర్.




**అంకుశం న్యూస్ ధర్మవరం ఫిబ్రవరి 16:** శ్రీ సత్య సాయి జిల్లా ధర్మవరంలో గత పది సంవత్సరాలుగా ధర్మవరం ఎల్ ఐ సి ఏజెంట్లు ఎంతో సాధించిన ఎల్ఐసి ఏజెంట్ల ను బ్రాంచ్ కార్యాలయంలో మేనేజర్ పి విజయ్ శేఖర్ దుశ్శాలవాతో సన్మానించారు .ఈరోజు వీణా డే సందర్భముగా బ్రాంచ్ మేనేజర్ శ్రీ. ఎం. విజయ శేఖర్ ఆధ్వర్యం లో గత 10 సంవత్సరాలలో వీణా కి అర్హత సాధించిన ఏజెంట్స్ మిత్రుల సమావేశం జరిగినది. ఈ సమావేశం లో మేనేజర్ శ్రీ. విజయ శేఖర్ మాట్లాడుతూ ఎండీఆర్టీ యొక్క ప్రాధాన్యత సాధించవలసిన ఆవశ్యకత కలిగే ప్రయోజనాలు విపులంగా చెప్పడం జరిగింది.తదుపరి గత కొన్నేళ్లుగా అధిక పాలసీల ప్రీమియం అర్హత సాధించిన ఎమ్ డి ఆర్ టి ఏజెంట్స్ ను సన్మానించడం జరిగింది. ఈ ఈ కార్యక్రమంలో ఆనంద్, ఎల్ ఐ సి ఏం డి ఆర్ టి ఏజెంట్లు సీ,ఎమ్ క్లబ్స్ మెంబర్స్ సంద్ర రమేష్, డివి రమణారెడ్డి, నాగరాజు, లక్ష్మీనారాయణ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.